VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్,
MOBILE:
9494498787,9440232308.



# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
ఆళ్లగడ్డ, కర్నూలు జిల్లా
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం 12-06-2024 | సంపుటి : 06 | సంచిక : 271 | పేజీలు : 8 | వెల : రూ 3-00


# ప్రజా తీర్పుతో రాష్ట్ర ప్రతిష్ఠ పెరిగింది

## టీడీపీ శాసనసభా పక్ష నేతగా చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నిక




విజయవాడ:జూన్ 11 ( విభారె) తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి కూటమి శాసన సభాపక్ష సమావేశం విజయవాడ-ఏ కన్వెన్షన్ లో ప్రారంభమైంది కూటమి తరపున గెలుపొందిన ఎంఎల్ఏలు ఈ సమావేశానికి హాజరయ్యారు.వారంతా నారా చంద్రబాబు నాయుడును శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రబాబు నాయుడు పేరును ప్రతిపాదించారు. చంద్రబాబును కూటమి శాషనసభాపక్ష నేతగా ఎన్నుకున్న ఏకగ్రీవ తీర్మానాన్ని కూటమి నేతలు గవర్నర్ కు పంపబోతున్నారు.ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ కూటమికి ఆహ్వానం పంపనున్నారు. చంద్రబాబు బుధవారం ఉదయం 11.27 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. కాగా తనను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నందుకు టిడిపి అధినేత ధన్యవాదాలు తెలిపారు.

## మూడు పార్టీల నేతలు సమిష్టిగా పనిచేసారు చంద్రబాబు నాయుడు



విజయవాడ,జూన్ 11( విభారె) మంగళవారం జరిగిన ఎన్డీయే శాసనసభాపక్ష భేటీలో చంద్రబాబును నేతగా ఎన్నుకున్నారు.అందుకు అయన దన్యవాదాలు తెలిపారు.చంద్రబాబు మాట్లాడుతూ – రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇవ్వని తీర్పును ప్రజలు ఇచ్చారు. – ప్రజలు ఇచ్చిన తీర్పును నిలబెట్టుకోవాల్సిన బాత్యత మనపై ఉంది . రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రజలు చొరవ చూపారు. నూటికి నూరు శాతం 3 పార్టీల నేతలు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేశారు. ప్రజల మనోభావాల మేరకు కార్యకర్తలు పనిచేశారు. మూడు పార్టీల నేతలు, కార్యకర్తలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. ఎన్నికల్లో 93 శాతం గెలవడం దేశ చరిత్రలో అరుదైన అనుభవం. ఎన్నికల్లో 57 శాతం ఓట్లతో ప్రజలు ఆశీర్వదించారు. ప్రజల తీర్పుతో మనందరిలో మరింత బాధ్యత పెరిగింది. జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లోనూ గెలుపొందింది . బీజేపీ పోటీ చేసిన 10 స్థానాల్లో 8 సీట్లు గెలుపొందింది. ప్రజలు ఇచ్చిన తీర్పు వల్ల ఢిల్లీలో అందరూ గౌరవించారు. ప్రజల తీర్పుతో రాష్ట్ర ప్రతిష్ట, గౌరవం పెరిగింది. పవన్ కల్యాణ్ సమయస్ఫూర్తిని ఎప్పటికీ మరచిపోలేను. నేను జైలులో ఉన్నప్పుడు పవన్ వచ్చి పరామర్శించారు. టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకుంటున్నట్లు చెప్పారు – బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకుంది. ఎలాంటి పొరపచ్చాలు లేకుండా కలిసి పనిచేశాం. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర సహకారం అవసరం. రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తామని కేంద్ర నేతలు చెప్పారు. ప్రజలు పవిత్రమైన బాధ్యత మనకు అప్పగించారు. నాలుగోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తున్నా. – మీ అందరి సహకారంతో రేపు ప్రమాణ స్వీకారం చేస్తున్నా. కార్యక్రమానికి మోదీ, ఎన్డీయే నేతలు హాజరవుతున్నారు. సమిష్టిగా పరజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైంది. 14 ఏళ్లు సీఎంగా, 15 ఏళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నా. ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మలచుకుని ముందుకెళ్లాం. రాష్ట్రంలో చాలా సమస్యలున్నాయని అన్నారు.పేదల జీవితం మార్చేందుకు అందరూ కష్టపడదాం. రాష్ట్రం పూర్తిగా శిధిలమైంది. ఓటర్లు ప్రవర్తించిన తీరు రాష్ట్ర చరిత్రలో నిలుస్తుంది. పదవి వచ్చిందని విర్రవీగితే ఇదే పరిస్థితి వస్తుంది. తప్పు చేసిన వారిని క్షమిస్తే అలవాటుగా మారుతుంది. తప్పు చేసిన వారికి చట్టపరంగా శిక్ష పడాల్సిన అవసరం ఉంది. విధ్వంస, కక్షా రాజకీయాలను ప్రక్షాళన చేయాలి. నా కుటుంబానికి అవమానం జరిగింది. గౌరవ సభ కాదు.. కౌరవ సభ అని చెప్పి బయటకు వచ్చా. ప్రజాక్షేత్రంలో గెలిచి గౌరవ సభగా చేసి అడుగుపెడతానని చెప్పా. – నా శపథాన్ని ప్రజలు గౌరవించారు.. గౌరవించిన ప్రజలను నిలబెట్టాలి. పోలవరం పనులు 72 శాతం పూర్తి చేశాం. పోలవరం డయాఫ్రమ్ వాల్ కొట్టుకపోయింది. – కేంద్ర సహకారంతో పోలవరం పూర్తి చేస్తాం. నదులను అనుసంధానించి ప్రతి ఎకరానికి నీళ్లందిస్తాం. వ్యవసాయ రంగం స్థిరత్వానికి కృషి చేస్తాం . రాష్ట్రం సంక్షోభంలో ఉంది.. రైతులు అప్పుల పాలయ్యారు. నిర్మాణాత్మకంగా వెళ్లాలి. ప్రజావేదిక మాదిరిగా కూల్చివేతలు ఉండవు. మూడు రాజధానులంటూ ఆటలాడే పరిస్థితి ఉండదు. – అమరావతి రాజధానిగా ఉంటుంది. విశాఖను ఆర్థిక, ఆధునిక రాజధానిగా చేసుకుందాం. గతంలో సీఎం వస్తే చెట్లు కొట్టివేత, షాపుల బంద్ జరిగేది. గతంలో సీఎం వస్తే పరదాలు కట్టడం వంటివి జరిగేవి. – నేను మామూలు మనిషిగానే వస్తా.. అందరితో కలిసి ఉంటానని అన్నారు.మేమందరం సామాన్య వ్యక్తులుగానే మీ వద్దకు వస్తాం. హోదా అనేది సేవ కోసం తప్ప.. పెత్తనం కోసం కాదు. – సీఎం వస్తే ప్రజలకు ఇబ్బంది కలగకూడదని ఆదేశాలిచ్చా. ఏ ఒక్కరి ఆత్మగౌరవానికి భంగం కలగకూడదు. – ప్రజాహితం కోసం పనిచేస్తాం. ప్రతి నిర్ణయం.. ప్రతి అడుగు ప్రజల కోసమే. స్టేట్ ఫస్ట్ నినాదంతో ముందుకు వెళ్తామని అన్నారు.– తప్పులు జరిగితే సలహాలు ఇచ్చే విధానం నెలకొల్పుతాం. – రాష్ట్ర పునర్నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా సాగాలి. ప్రపంచ దేశాల్లో భారత్ నంబర్ వన్ గా తయారు కావాలి. 2047 నాటికి భారత్ మొదటి స్థానంలో ఉంటుంది. ప్రపంచంలో భారతీయులు నంబర్ వన్ గా ఉండాలి. తెలుగుజాతి ప్రపంచంలో నంబర్ వన్ గా ఉండాలని అన్నారు.

## కళకళలాడుతున్న అమరావతి



విజయవాడ, జూన్ 11 ( విభారె) వంద పొక్లయిన్‌లు, వందల మంది కార్మికులు, రాత్రి పగలు సాగుతున్న పనులు. ఇప్పుడు అమరావతికి పునర్వైభవం వస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం రావడంతో రాజధాని అమరావతి కళకళలాడుతోంది. ఐదేళ్లుగా పేరుకుపోయిన చెత్తను అధికారులు తొలగిస్తున్నారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం రెండు రోజుల్లో కొలువు దీరనుంది. ఈ లోపు అక్కడ ఉన్న పరిస్థితిపై నివేదిక ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మూడు రాజధానులతో అమరావతి ప్రాంతాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. దీంతో కంప చెట్లు పేరుకుపోయాయి. ఆ ప్రాంతమంతా అడవిని తలపించింది. ఇప్పుడు ప్రభుతవం మారడంతో అక్కడ మళ్లీ యాక్టివిటీస్ మొదలయ్యాయి. సీఎస్‌గా నీరబ్‌కుమార్ పగ్గాలు చెపట్టిన తర్వాత అమరావతిలో పనులు ప్రారంభమయ్యాయి. మూడు నాలుగు రోజుల నుంచి అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. దీని కోసం దాదాపు వంద పొక్లెయిన్లను ఏర్పాటు చేశారు. 25 ప్రాంతాల్లో వందకుపైగా కిలోమీటర్ల పరిధిలో పనులు చేపట్టారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం నాటికి అమరావతిలో పనులు పూర్తి చేయాలన్న సంకల్పంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ పనులను నీరబ్ కుమార్ స్వయంగా ఆదివారం పరిశీలించారు. అమరావతిలో పనులు జరుగుతున్న ప్రాంతంలో పర్యటించిన సీఎస్ నీరబ్ కుమార్... అక్కడ అధికారులతో మాట్లాడారు. సుమారు రెండు మూడు గంటలు ఆ ప్రాంతంలో గడిపిన ఆయన.. జరుగుతున్న పనులు పరిశీలించారు. రోడ్లను కూడా పరిశీలించారు. రాజధాని కోసం శంకుస్థాపన జరిగిన ప్రాంతాన్ని కూడా చూశారు. అక్కడి నుంచి మొదలైన ఆయన పర్యటన సీఆర్‌డీఏ ఆఫీస్, తర్వాత వివిధ అధికారిక భవనాలను కూడా గమనించారు. అక్కడ ప్రస్తుతం ఉన్న పరిస్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. చాలా రోజుల తర్వాత ఉన్నతాధికారులు తమ ప్రాంతానికి రావడంపై రాజధాని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. నీరబ్‌కుమార్‌ను సన్మానించారు అదే టైంలో సీఆర్డీఏ కమిషనర్‌గా ఉన్న వివేక్ యాదవ్ పని తీరుపై ఫిర్యాదు చేశారు. సమస్యల గురించి ఎన్నిసార్లు చెప్పుకున్న పట్టించుకోవడం లేదని కలిసేందుకు కూడా సరిగా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని వాపోయారు. అనంతరం మీడియాతో మాట్లాడిన నీరబ్ కుమార్... చంద్రబాబు ఆదేశాలతో అమరావతిలో పనులు చేపట్టామన్నారు.

## బాబు ప్రమాణ స్వీకారానికి హాజరుకానున్న మోడీ, అమిత్ షా

విజయవాడ,జూన్11 ( విభారె) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. కేసరపల్లి ఐటీ పార్కు ప్రాంగణంలో ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీతో పాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. దీంతో ప్రధాని పర్యటనకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకున్నారు.ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో అధికారులతో సీఎస్ సమీక్షించారు. టూర్ ప్రోగ్రాం ప్రకారం ప్రధాని ఉదయం 8.20 గం.లకు ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి ఉ.10.40.గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారన్నారు. ఉ.10.55 గం.లకు అక్కడ సమీపంలోని ఐటి పార్కు ప్రాంగణానికి చేరుకుని ఉ.11గం.ల నుంచి మధ్యాహ్నాం 12.30 గం.ల వరకు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నాం 12.40 గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని 12.45 గం.లకు విమానంలో భువనేశ్వర్ వెళ్లనున్నారు.



**ట్రాఫిక్ ఆంక్షలు.. :** ప్రమాణ స్వీకారం నేపథ్యంలో బుధవారం విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. విజయవాడ నగరం నుంచి గన్నవరం వెళ్లే వాహనాలను పోలీసులు మళ్లించనున్నారు. విజయవాడ రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి వెళ్లే వాహనాలతో పాటు.. అంబులెన్స్, అత్యవసర ఆరోగ్య చికిత్స వాహనాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. అలాగే గన్నవరం వెళ్ళే ఇతర వాహనాలు అన్నిటినీ నిలిపి వేయనున్నారు. కేవలం పాసులు ఉన్న వారికే అనుమతి ఇవ్వనున్నారు. ఇక విజయవాడలో సాధారణ వాహనలు కూడా మళ్లించనున్నారు. విజయవాడ నుంచి ఏలూరు, విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలకు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బెంజ్ సర్కిల్ నుంచి కంకిపాడు-పామర్రు-హనుమాన్ జంక్షన్-ఏలూరు వైపు మళ్లిస్తారు. అలాగే.. వియవాడ వెలుపల ట్రాన్స్ పోర్టు వాహనాలను మళ్లించనున్నారు. విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి నూజివీడు? జి. కొండూరు ఇబ్రహింపట్నం మీదుగా వెళ్ళాల్సి ఉంటుంది. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు హనుమాన్ జంక్షన్ వద్ద నుండి గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, పెనుముడి వారధి, రేపల్లె, బాపట్ల, త్రోవగుంట, ఒంగోలు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు మేరపెట్ల, అద్దంకి, నరసరావుపేట, పిడుగురాళ్ళ, మిర్యాలగూడెం, నల్గొండ నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ఇక హైదరాబాద్ నుంచి గుంటూరు వెళ్లు వాహనాలు నల్గొండ, మిర్యాలగూడెం, దాచేపల్లి, పిడుగురాళ్ళ, నరసరావుపేట, అద్దంకి, మేదరమెట్ల నుండి మళ్లించనున్నారు.

## గత ఐదేళ్లు విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నాం

కష్టాల్లో ఉన్న ఎపిని గాడిలో పెట్టే బాధ్యత చంద్రబాబుదే
బాబు అనుభవం ఎపి అభివృద్ధికి దోహదపడుతుంది
కలసికట్టుగా కూటమిని గెలిపించాం...అభివృద్ది చేసి చూపుదాం
కూటమి భేటీలో జనసేనాని పవన్ కళ్యాణ్ వెల్లడి



అమరావతి,జూన్ 11( విభారె) గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ విపత్కర పరిస్థితులు ఎదుర్కొందని జనసేనాని పవన్ కళ్యాణ్ అన్నారు. ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా చంద్రబాబు పేరును పవన్ ప్రతిపాదించారు. కష్టాల్లో ఉన్న ఏపీని గాడిన పెట్టేందుకు చంద్రబాబు లాంటి అనుభవజ్ఞుడైన నాయకుడు అవసరం అని చెప్పారు. అనంతరం చంద్రబాబును పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. విజయవాడ ఏ కన్వెన్షన్ హాలులో మంగళవారం ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. చంద్రబాబును ఎన్డీయే కూటమి శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ తీర్మానాన్ని గవర్నర్‌కు పంపనున్నారు. ఆయన ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పంపనున్నారు. అనంతరం బుధవారం ఉదయం 11:27 గంటలకు ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తారు. ఎన్నికల్లో కూటమి అద్భుత మెజార్టీతో 164 అసెంబ్లీ స్థానాలు, 21 లోక్ సభ స్థానాలను దక్కించుకుందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. 'కూటమి ఎలా ఉండాలో అందరం కలిసికట్టుగా చూపించాం. కక్ష సాధింపులు, వ్యక్తిగత దూషణలకు సమయం కాదు. 5 కోట్ల మంది ప్రజలు మనందరిపై నమ్మకం పెట్టుకున్నారు. అభివృద్ధిని సమష్టిగా ముందుకు తీసుకెళ్లాలని పవన్ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపా కూటమి కలిసి కట్టుగా పోరాడి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుందని చెప్పారు. కూటమి శాసన సభాపక్ష నేతగా చంద్రబాబు పేరును ప్రతిపాదించిన అనంతరం పవన్ మాట్లాడారు.

# సంపాదకీయం

బుధవారం 12-06-2024

## ఇప్పటి వరకు ఓ లెక్క... ఇక నుంచి మరో లెక్క

ఇప్పటి వరకు ఓ లెక్కా.. ఇకపై మరో లెక్క.. ఈ మూవీ డైలాగ్ ఇప్పుడు పర్‌ఫెక్ట్‌గా బీజేపీకి సూటవుతుంది. ఎందుకంటే ప్రజలు ఇచ్చిన తీర్పు దెబ్బకు.. బీజేపీ మెజార్టీ సాధించలేకపోయింది. దీంతో ఇప్పుడు టీడీపీ, జేడీయూ మద్దతు అత్యంత కీలకమైంది. మరి ఇకపై ఎన్డీఏ రూల్ ఎలా ఉండబోతుంది? ఎలాంటి మార్పులు ఉండబోతున్నాయి..? పాలన.. ఆర్థిక వ్యవస్థలో మార్పులు.. స్థితిగతుల మార్పులు.. ఇలా ప్రతి ఒక్క అంశంపై బీజేపీకి చాలా ప్రణాళికలు ఉన్నాయి.మోడీ థర్డ్ టర్మ్‌లో చాలా మార్పులు చేయాలని ఊహించుకున్నారు. దీని కోసమే బీజేపీకి 350 సీట్లు.. టోటల్‌గా ఎన్డీఏకు 400 సీట్లు ఇవ్వాలని దేశ ప్రజలను రిక్వెస్ట్ చేశారు. బట్ అనుకున్నది జరగలేదు.. బీజేపీ కౌంట్ 240 దగ్గరే ఆగింది. టోటల్‌గా ఎన్డీఏ లెక్క చూసుకుంటే 293 దగ్గరే ఆగిపోయింది. సొంతంగా మెజార్టీ లేదు.. ప్రభుత్వం నిలవడాలంటే టీడీపీ, జేడీయూ మద్ధతు తప్పదు. సో.. ఇకపై ఇకముందులా ఉండదు.. గత రెండు టర్మ్‌లో ఫుల్ మెజార్టీ ఉండటంతో బీజేపీ ఆడిందే ఆట పాడిందే పాటలా సాగింది. కానీ ఇకపై అలా ఉండబోదు.. ఇది మాత్రం పక్కా.మరి టీడీపీ, జేడీయూతో పొత్తు కీలకమవడం బీజేపీకి మేలా? చేటా? ఈ క్వశ్చన్‌కి ఇప్పుడే ఆన్సర్ చెప్పడం కాస్త కష్టం.. బట్.. బీజేపీ అత్యుత్సాహానికి మాత్రం బ్రేక్ పడటం ఖాయం.. ఈ ఐదేళ్లలో సంచలనాల జోలికి వెళ్లడం కుదరదు.. ఎందుకంటే ఏ నిర్ణయం తీసుకోవడానికి ముందు ఎన్డీఏ మిత్రపక్షాలతో చర్చించాల్సిందే.. అలా కాకుండా మొండిగా.. ఏకపక్షంగా ముందుకు వెళతామంటే కుదరదు. ఎందుకంటే ఈ రెండు పార్టీల మనోభావాలు ఏ మాత్రం దెబ్బతిన్నా.. మోడీ సర్కార్ మనుగడకే ఎసరు.. సో.. ఇకపై పరిగెత్తడం అటుంచి.. వేసే ప్రతి అడుగు ఆచి తూచి వేయాల్సి ఉంటుంది. మోడీ ఈ టర్మ్‌లో చాలా చేయాలనుకుంది. రాజ్యాంగంలో మార్పులు.. పీఓకేను స్వాధీనం చేసుకోవడం.. అందులో చాలా ముఖ్యమైనవి.. ఇవి జరగాలంటే 400 సీట్లు మాకు కావాలి అని ఎన్నికల ప్రచారంలో చెప్పారు బీజేపీ నేతలు.. బట్ జరగలేదు.. అంటే ఇప్పుడీ రెండు పనులు అటకెక్కినట్టే అనిపిస్తోంది. ఇక వన్ నేషన్.. వన్ ఎలక్షన్.. దీనిపై కూడా మోడీ సర్కార్ ఎలా ముందుకు వెళుతుంది అనేది చూడాలి.అయితే ఈ ఎన్నికలు ఏపీకి మాత్రం చాలా మంచి అవకాశాన్ని కల్పించాయి. ఎలా అంటారా? సింపుల్ బీజేపీకి ఫుల్ మెజార్టీ రాకపోవడం.. ఏపీలో టీడీపీకి ఎక్కువ సీట్లు గెలవడం.. అందుకే ఇప్పుడు ఔఆంలో చంద్రబాబు కింగ్ మేకర్ అయ్యారు. ఔఆంలో బీజేపీ తర్వాత అత్యధికంగా ఎంపీ సీట్లు గెలిచిన పార్టీ టీడీపీనే.. అందుకే చంద్రబాబు కుర్చీ మోడీ పక్కనే ఉంది.ఇకపై బీజేపీ సర్కార్ ఏ నిర్ణయం తీసుకోవాలన్న చంద్రబాబును సంప్రదించాల్సిందే.. అభిప్రాయాలు తీసుకోవాల్సిందే.. ఆయన సరే అంటే ముందుకు.. లేదంటే ఆయనను బుజ్జగించాల్సిందే.. నిజానికి చంద్రబాబుకున్న రాజకీయ అనుభవంతో కేంద్రంలో కీలకంగా వ్యవహరించే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా రాష్ట్రపతి పదవికి ఎవరి పేరుని ప్రపోజ్ చేయాలి? కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన అవసరాలు ఏంటి? ఏపీకి ప్రత్యేక హోదా డిమాండ్.. రాష్ట్ర విభజన అంశాలు.. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు.. ఇవన్నీ సాధించుకునేందుకు చంద్రబాబుకు అంది వచ్చిన అవకాశం ఇది.అంతేకాదు కేంద్రప్రభుత్వంలో కీలకమైన శాఖలను చంద్రబాబు కోరే అవకాశం ఉంది. టు బీ ఫ్యాక్ట్ అవకాశం కాదు.. డిమాండ్ అనే చెప్పాలి. 3 నుంచి 5 శాఖలు కోరే ఛాన్స్ కనిపిస్తోంది. అయితే ఏ శాఖలు కేటాయిస్తారు? ఎన్ని కేబినెట్ పదవులు ఇస్తారు? ఎన్ని సహాయమంత్రి పదవులు కేటాయిస్తారు? అన్నదానిపై కొన్ని రోజుల్లో క్లారిటీ రానుంది. మొత్తంగా కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటులో టీడీపీది చాలా కీలకమైన పాత్ర..అటు నితీష్ కుమార్‌ది కూడా అదే పరిస్థితి.. బిహార్‌లో జేడీయూ 12 స్థానాల్లో గెలుపొందింది. ఎన్డీయే కూటమిలో అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీలో జేడీయూది థర్డ్ ప్లేస్.. సో.. ఆయన కూడా చాలా కీలకంగా మారారు. అంతేకాదు నితీష్ కూడా బిహార్‌కు ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆయన కూడా ఇప్పటికే తన డిమాండ్ల లిస్ట్‌ను బీజేపీ పెద్దల ముందు ఉంచినట్టు తెలుస్తోంది..చంద్రబాబు కావొచ్చు.. నితీష్ కుమార్ కావొచ్చు.

## సంచలనం సృష్టించిన పాతబస్తీ హత్య కేసులో.. కోర్టు కీలక తీర్పు..!

హైదరాబాద్ జూన్ 11 పాతబస్తీలో సంచలన సృష్టించిన హత్య కేసులో కోర్టు తీర్పు వెలువరించింది. పోలీసులు నిందితులకు శిక్షపడే విధంగా పక్కాగా సాక్ష్యాధారాలు ప్రవేశ పెట్టడంతో..న్యాయస్థానం మృతుని కుటుంబసభ్యులకు న్యాయం చేకూరింది. దీంతో బాధితుడి కుటుంబసభ్యులు, స్నేహితులు టపాసులు పేల్చి, మిఠాయిలు పంచి



ఆనందం వ్యక్తం చేశారు. బహదూర్ పురా పోలీసులతో పాటు తీర్పు ఇచ్చిన న్యాయస్థానానికి ధన్యవాదాలు తెలుపుతూ జేజేలు కొట్టారు. 2017 లో కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన మన్సూర్ ఖాన్ అనే వ్యక్తిని బహదూర్ పురా, జూ పార్కు రోడ్డు సమీపంలోని సర్వీస్ స్టేషన్ వద్ద దారుణంగా హతమార్చారు దుండగులు. దీంతో బహదూర్ పురా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. పోలీసులు కేసును సీరియస్‌గా తీసుకుని క్షుణ్ణంగా దర్యాప్తు జరిపారు. ప్రతి సాక్ష్యాధారాలను ప్రవేశ పెట్టి కోర్టుకు సమర్పించారు. ఇరువురి వాదనలు విన్న కోర్టు, హైదరాబాద్ నాంపల్లిలోని మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి ముగ్గురికి జీవిత ఖైదు విధించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన ఖాలేద్, అన్వర్ అలియాస్ అన్నూ, మహమ్మద్ మునవ్వర్ అలీ అలియాస్ బబ్బూకు జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి రూ. 25,500 జరిమాన, జరిమాన కట్టని పక్షంలో మరో 6 నెలల శిక్షను పొడిగిస్తూ అదేశాలు జారీ చేశారు నాంపల్లి కోర్టు న్యాయమూర్తి.తీర్పు వెలువడిన అనంతరం బాధిత కుటుండసభ్యులు పోలీస్ శాఖకు, న్యాయస్థానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు వ్యవస్థల పై తమకు పూర్తిగా నమ్మకం ఉందని ఆనందము వ్యక్తం చేశారు. నేరం చేసిన నిందితులకు ఎప్పటికైనా శిక్ష పడుతుంది. చట్టం నుంచి తప్పించుకునే ప్రసక్తే లేదని మరోసారి నిరూపితమైంది.

## అయ్యో.. కెనడాలో భారత సంతతి వ్యక్తి దారుణ హత్య! గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు






సర్రె, జూన్ 11 జూన్ 11 : విదేశాల్లో చదువులు, ఉద్యోగాల కోసం వెళ్లిన భారతీయ విద్యార్థులు, భారత సంతతికి చెందిన వ్యక్తులు ఇటీవల కాలంలో వరుసగా మృతి చెందుతున్న సంగతి తెలిసిందే.వీరి మరణాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే భారత్‌కు చెందిన పలువురు వ్యక్తులు ఏదో ఒక ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. తాజాగా కెనడాలో మరో సంఘటన చోటు చేసుకుంది. భారత సంతతికి చెందిన 28 ఏళ్ల యువరాజ్ గోయల్ అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పంజాబ్‌లోని లూథియానాకు చెందిన భారతీయ సంతతికి చెందిన వ్యక్తి శుక్రవారం కెనడాలోని సర్రేలో గుర్తు తెలియని వ్యక్తులు తుపాకులతో కాల్చి చంపారు.విద్యార్థి వీసాపై 2019లో కెనడా వచ్చిన యువరాజ్ గోయల్.. ఇటీవలే కెనడియన్ పర్మనెంట్ రెసిడెంట్ (ఖఖీ) హోదాను పొందాడు. అక్కడ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. యువరాజ్ గోయల్ తండ్రి రాజేష్ గోయల్ కట్టెల వ్యాపారి. అతని తల్లి శకున్ గోయల్ గృహిణి. పేదింటికి చెందిన యువరాజ్ కష్టపడి చదివి.. ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉన్నాడు. ఉన్నట్లుండి కుమారుడి మరణవార్త తెలియడంతో ఆ తల్లిదండ్రుల ఆవేదన కట్టలు తెంచుకుంది. మరోవైపు యువరాజ్‌కు ఎలాంటి నేర చరిత్ర లేదని, అతని హత్యకు గల కారణాలు దర్యాప్తులో ఉన్నాయని రాయల్ కెనడియన్ పోలీసులు తెలిపారు .బ్రిటీష్ కొలంబియాలోని సర్రేలోని 164 స్ట్రీట్‌లోని 900-బ్లాక్‌లో కాల్పులు జరుగుతున్నట్లు సర్రే పోలీసులకు ఫోన్ కాల్ వచ్చింది. జూన్ 7 ఉదయం 8:46 గంటలకు ఈ సంఘటన జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు యువరాజ్‌పై కాల్పులు జరిపారు. పోలీసులు అక్కడికి చేరుకోగా అప్పటికే యువరాజ్ ప్రాణాలు కోల్పోయి కనిపించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సుర్రే ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనుమానితులు మన్వీబాస్రామ్ (23), సాహిబ్ బాస్రా (20), హర్కిరత్ ఝుట్టీ (23), ఓంటారియోకు చెందిన కీలాన్ ఫ్రాంకాయిస్ (20)లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై హత్యా నేరం ˇ కేసు నమోదు చేశారు. కాగా యువరాజ్ హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఎంపీగా కొనసాగుతా.. ఎమ్మెల్యే పదవిని వదులుకుంటా: అఖిలేష్ యాదవ్

న్యూఢిల్లీ జూన్ 11 ఎమ్మెల్యే పదవిలో ఉండి ఎంపీగా పోటీచేసి గెలిచిన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్.. తాను ఎంపీగానే కొనసాగుతానని ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన సమాజ్‌వాది పార్టీ ఎంపీలతో ఇవాళ అఖిలేష్ యాదవ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎంపీగానే కొనసాగుతానని, త్వరలో ఎమ్మెల్యే పదవిని వదులుకుంటానని స్పష్టంచేశారు. ఇప్పటికే కర్హాల్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తలతోపాటు, మెయిన్‌పురి లోక్‌సభ నియోజకవర్గ కార్యకర్తలతో కూడా మాట్లాడానని, వారికి కూడా ఇదే విషయం చెప్పానని అఖిలేష్ తెలిపారు. కాగా ఈ సార్వత్రిక ఎన్నికల్లో అఖిలేష్ యాదవ్ కన్నౌజ్ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించారు. అంతకుముందు 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కర్హాల్ అసెంబ్లీ స్థానంలో గెలిచి.. ఉత్తరప్రదేశ్





అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్నారు.కర్హాల్ అసెంబ్లీ నియోజకవర్గం మెయిన్‌పురి జిల్లాలో ఉంది. అంతేగాక మెయిన్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా కర్హాల్ ఒకటి. పైగా ఈ ఎన్నికల్లో మెయిన్‌పురి లోక్‌సభ స్థానం నుంచి అఖిలేష్ సతీమణి డింపుల్ యాదవ్ ఎంపీగా గెలిచారు. ఈ క్రమంలో అఖిలేష్ యాదవ్ మెయిన్‌పురి, కర్హాల్ నియోజకవర్గాల ప్రజలతో సమావేశమై తన నిర్ణయాన్ని వెల్లడించారు. అదే నిర్ణయాన్ని ఇవాళ ఎంపీల సమావేశంలో ప్రకటించారు.లోక్‌సభ సభ్యుడిగా కొనసాగాలని నిర్ణయించుకున్న అఖిలేష్ యాదవ్‌ను త్వరలో సమాజ్‌వాది పార్టీ లోక్‌సభాపక్ష నేతగా ఎన్నుకుంటామని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్‌వాది పార్టీ 37 స్థానాల్లో విజయం సాధించింది. దాంతో లోక్‌సభలో మూడో అతిపెద్ద పార్టీగా ఎస్పీ అవతరించింది. 240 స్థానాలతో బీజేపీ అతిపెద్ద పార్టీగా, 99 స్థానాలతో కాంగ్రెస్ రెండో అతిపెద్ద పార్టీగా ఉన్నాయి.

## విద్యుత్ దీపాల అలంకరణలో ప్రభుత్వ కార్యాలయాలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 11 - రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలయిన తహసిల్దార్, ఎండిఓ, మున్సిపల్ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఈ మేరకు నంద్యాల మున్సిపల్ కార్యాలయాన్ని నిన్నటి నుండి అనగా సోమవారం నుండి 12వ తేదీ బుధవారం సాయంత్రం వరకు మున్సిపల్ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించినట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పాటయిన సందర్భంగా ఈ మేరకు విద్యుత్ దీపాలతో అలంకరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

## గ్రామ గ్రామన పార్టీని బలోపేతం చేస్తాం.... నంద్యాల జనసేన పార్టీ నాయకులు





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 11 - నంద్యాల నియోజకవర్గంలో జనసేన పార్టీ ని గ్రామ గ్రామన బలోపేతం చేస్తామని నంద్యాల జనసేన నాయకులు పేర్కొన్నారు. మంగళవారం జనసేన నాయకులు రాచమడుగు చందు ,సుందర్, గురు, మాట్లాడుతూ ఈరోజు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించి బుధవారం 12 వ తేదీన ఎన్ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా మరియు పవన్ కళ్యాణ్ కు కీలక పదవిలో ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించుటకు పవన్ కళ్యాణ్ త్యాగాలు కూడా చేయుటకు సిద్ధపడ్డారు. ఎన్డీఏ కూటమి ఓట్లు చీలకూడదని పట్టుదలతో శ్రమించి ఎన్డీఏ కూటమి విజయానికి ఎంతో శ్రమించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జనసేన నాయకులు కార్యకర్తలు అందరూ కూడా పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 2029 ఎన్నికల లోపల పార్టీని మరింత పటిష్టత పరిచి బలోపేతం చేయాలని లక్ష్మన్న పిలుపునిచ్చారు. ఇక నంద్యాల నియోజకవర్గం లో కూడా జనసేన పార్టీని గ్రామ గ్రామాన పార్టీని పటిష్టత పరిచి జనసేన పార్టీని బలోపేతం చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రాచమడుగు చందు సుందర్, గురు, దండు మురళి ,తో పాటు జనసేన కార్యకర్తలు గోస్పాడు వెంకీ, సంజీవ రాయుడు, చిన్న, రవి, ఫరుక్, శ్రావణ్, పాల్గొన్నారు.

## నిర్మాణంలో ఉన్న ఆస్తులపై కూడా పన్ను ప్రయోజనాలు..

### ఆ తేదీతోనే అసలు సమస్య

హైదరాబాద్ జూన్ 11 భారతదేశంలో నిర్మాణంలో ఉన్న ఆస్తులకు సంబంధించిన పన్ను నియమాల గురించి పన్ను చెల్లింపుదారులు తరచుగా గందరగోళానికి గురవుతారు. నిర్మాణంలో ఉన్న లేదా ముందస్తు స్వాధీనం కాలం అనేది గృహ రుణం ప్రారంభం లేదా పరిశీలనలో ఉన్న ఆస్తి నిర్మాణాన్ని పూర్తి చేయడం మధ్య వ్యవధిని సూచిస్తుంది.ఆదాయపు పన్ను చట్టాల ప్రకారం గృహ కొనుగోలుదారు ఇంటిని స్వాధీనం చేసుకున్న ఆర్థిక సంవత్సరం నుంచి 5 సమాన వాయిదాలలో నిర్మాణంలో ఉన్న ఆస్తి కోసం రుణంపై పన్ను ప్రయోజనాలను క్లెయిమ్ చేయవచ్చు. అయితే అలాంటి ఆస్తుల అమ్మకంపై మూలధన లాభాల పన్నుకు సంబంధించినది నిపుణులు చెబుతున్నారు. పన్ను బాధ్యత విషయానికి వస్తే, ఆదాయపు పన్ను (ఐటి) చట్టంలోని సెక్షన్ 54 ప్రకారం స్వాధీనం చేసుకున్న తేదీని పరిగణనలోకి తీసుకోవాలని ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఐటిఎటి) ముంబై బెంచ్ ఇటీవల స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఐటీ యాక్ట్ సెక్షన్ 54 గురించి వివరాలను తెలుసుకుందాం.ఒక నిర్దిష్ట వ్యవధిలోపు కొత్త ఇంటిని కొనుగోలు చేయడానికి వచ్చే ఆదాయాన్ని పెట్టుబడి పెట్టినప్పుడు మాత్రమే ఇంటిని విక్రయించిన తర్వాత పన్ను ప్రయోజనాలను క్లెయిమ్ చేయవచ్చు. అంటే ఒక ఇంటి నుంచి వచ్చిన ఆదాయం కొత్త ఇంటిని కొనుగోలు చేయడానికి పెట్టుబడి పెట్టినప్పుడు పాత ఇంటిని విక్రయించడం ద్వారా వచ్చిన లాభంపై చెల్లించాల్సిన పన్ను తక్కువగా వస్తుంది. ఐటీ చట్టాల ప్రకారం పాత ఇంటిని విక్రయించిన ఏడాది ముందు లేదా రెండేళ్లలోపు కొత్త ఇంటిని కొనుగోలు చేయాలి. ప్రత్యామ్నాయంగా పాత ఆస్తిని విక్రయించిన తేదీ నుంచి మూడు సంవత్సరాలలోపు తన కొత్త నివాస ప్రాపర్టీని నిర్మించుకోవాలి. ఐటీఏటీ తీర్పు విషయానికి వస్తే ఇది ఎఫ్‌వై 2010-11కి సంబంధించి ఒక నాన్-రెసిడెంట్ కేసుకు సంబంధించినది నిపుణులు వివరిస్తున్నారు. అయితే మూలధన లాభాలపై పన్ను మినహాయింపును ఆదాయపు పన్ను శాఖ అనుమతించలేదు. వాస్తవానికి ఈ విషయం ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 54కు సంబంధించిందని నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా పాత ఆస్తి నుండి వచ్చిన మూలధన లాభాలపై పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసే తేదీకి సంబంధించినదని పేర్కొంటున్నారు.ఆదాయపు పన్ను చట్టం, 1961 ప్రకారం, నిర్దిష్ట పెట్టుబడి సాధనాల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా పన్ను చెల్లింపుదారులు దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను ప్రయోజనాలను పొందవచ్చు. ఈ పెట్టుబడులు ఐటీ చట్టాల్లో సెక్షన్ 54 నుండి 54 జీబీ వరకు వివరించిన మార్గదర్శకాల ప్రకారం ఉండాలి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 54 ప్రకారం పన్ను చెల్లింపుదారు నివాస గృహంలో పెట్టుబడి పెట్టడం ద్వారా దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను ప్రయోజనాలను క్లెయిమ్ చేయడానికి అనుమతి ఉంటుంది. పాత ఒక సంవత్సరం ముందు కొత్త నివాస గృహాన్ని కొనుగోలు చేస్తే సెక్షన్ 54

# కమలం వైపు ... బాలినేని చూపు

ఒంగోలు, జూన్ 11 ఒంగోలులో ఘోర పరాజయం చవి చూసిన మాజీ మంత్రి బాలినేని పొలిటికల్ ఫ్యూచర్‌పై లెక్కలు వేసుకుంటున్నారంట. కొడుకుతో కలిసి జనసేనలోకి వెళ్లడానికి సన్నాహాలు చేసుకుంటున్నారంట. మూడో కంటికి తెలియకుండా ఆ దిశగా అంతర్గత చర్చలు జరుగుతున్నాయంట. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని మొదట్లోనే వ్యతిరేకించిన బాలినేని. జగన్ ఆదేశాలతో తర్వాత సైలెంట్ అవ్వాల్సి వచ్చింది. ఇప్పుడా కోపంతోనే ఆయన పార్టీ మారే ఆలోచనలో పడ్డారంట.బాలినేని శ్రీనివాసరెడ్డి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బలమైన నేత. ఒంగోలు నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యే గా గెలిచారు. మెన్నటి కూటమి గాలిలో టీడీపీ అభ్యర్థి దామచర్ల జనర్ధన్ చేతిలో మూప్పై వేల ఓట్ల తేడాలో ఘోర ఓటమిని చవిచూసారు. ఎన్నికల ముందు గ్రౌండ్ వర్క్ ఎంత చేసుకున్నా.. ఓట్లు పడక పోవడంతో పొలిటికల్ ఫ్యూచర్‌పై బాలినేని ఆలోచనలో పడ్డారంట.ఎన్నికల టైంలో టీడీపీ కన్నా ఎక్కువ నగదు, బియ్యం బస్తాలు, మటన్ , చిక్కన్‌లు పంచారు వైసీపీ నేతలు.. వాటిని జనం బానే తీసుకున్నారు. దాంతో కనీసం వైసిపి అభ్యర్థిగా ఉన్న బాలినేని ఐదు వేల ఓట్లతో అయినా బయట పడతానని కాన్ఫిడేంట్ గా కనిపించారు. అయితే సీన్ రివర్స్ అయింది. వైసీపీకి పక్కగా పడుతాయన్న ఓట్లే పోల్ కాలేదని అర్థమవ్వడంతో.. బాలినేని కౌంటింగ్ రోజు మూడో రౌండ్‌కే కౌంటింగ్ హాల్ నుంచి వెళ్ళిపోయారు. ఇంత దారుణంగా ఓడిపోతానని ఊహించలేదని బాలినేని సన్నిహితుల వద్ద వాపోతున్నారంట.ఒంగోలులో 20 వేల ఇళ్ళపట్టాలు పంపిణీ చేయించిన బాలినేనికి ఓటమి పెద్ద షాకే ఇచ్చింది. బాలినేని ఫాలోయర్‌గా ఉన్న ఒంగోలు మేయర్ గంగడ సుజత టీడీపీ లోకి వెళ్లడం ఖాయమైంది. ఇప్పటికే ఆమె టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల టీంతో టచ్ లో ఉన్నారంట. ఒంగోలు కార్పొరేషన్ లో మొత్తం 50 డివిజన్ లలో 43 స్థానాలు వైసీపీ గెలుచుకోగా ఒక స్థానం జనసేన మిగిలిన స్థానాలను



టీడీపీ గెలిచింది. రాష్ట్రంలో అధికారం మారటంతో కార్పొరేటర్లు టీడీపీ వైపు చూస్తున్నారు. దాంతో ఒంగోలు నగరపాలక సంస్థ రాజకీయ ముఖ చిత్రం మారిపోనుంది. ఇదంతా బాలినేని మాస్టర్ ప్లాన్ అన్న టాక్ నడుస్తుంది.ఏపీలో అక్కడక్కడా జరుగుతున్న గొడవలపై బాలినేని ఎక్స్ వేదికగా స్పందించిన తీరుతో అసలు సిసలైన అనుమానం జనాల్లో మొదలైంది. 'అఖండ విజయం సాధించిన పవన్ కల్యాణ్ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు. హింసాత్మాక ఘటనలకు తావులేదని నిన్నటి రోజున మీరిచ్చిన సందేశం హర్షణీయం.. శాసనసభ్యునిగా నా 25ఏళ్ల రాజీకియ జీవితంలో ఎటువంటి హింసాత్మాక ఘటనలకు తావులేదు. అయితే మీ వ్యాఖ్యలకు పూర్తి భిన్నంగా ఒంగోలు చరిత్రలో ఎన్నడూలేని విధంగా చోటు చేసుకుంటున్న హింసాత్మాక ఘటనలు, అక్రమ కేసులు , భౌతిక దాడులపై మీరు స్పందించాలని కోరుకుంటున్నాను.. ధన్యవాదాలు' అని బాలినేని ట్వీట్ చేశారు.ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నారా చంద్రబాబు ఉండగా.. పవన్ పేరే ప్రస్తావించే ఎందుకు ట్వీట్ చేశారన్నది ఇప్పుడు వైసీపీ, జనసేన అభిమానుల్లో చర్చగా మారింది. వాస్తవానికి పవన్-బాలినేని మధ్య కొత్త పరిచయమేమీ అక్కర్లేదు. ఇద్దరి మధ్య సత్సంబంధాలున్నాయి. ఇక సినీ ఇండస్ట్రీ పరంగా కూడా బాలినేనికి చాలా మంది నిర్మాతలతో వ్యాపార సంబంధాలు కూడా ఉన్నాయి. ఆ మధ్య పవన్ కల్యాణ్ సినిమాకు బాలినేని కోట్లలో డబ్బులు కూడా ఇన్వెస్ట్ చేశారు.ఆ క్రమంలో జనసేనలోకి వెళితే తన వారసుడు ప్రణీత్ రెడ్డికి పొలిటికల్ ఫ్యూచర్ ఉంటుందని.. తనకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పరిచయాలతో మళ్లీ మునుపటి రోజులు తెచ్చుకోవచ్చని బాలినేని భావిస్తున్నారట. అందుకే వైసీపీని వీడి.. పవన్ సమక్షంలో జనసేనలో చేరడానికి మంత్రాంగం మొదలుపెట్టారంట. ఒంగోలుతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బాలినేని తన అనుచరులను కాపాడుకోవాలంటే జనసేనలోకి వెళ్ళటం మంచిదని ఫిక్స్ అయ్యారంట. జనసేన అధినేత పవన్ కల్యాణ్ రిప్లై కోసం ఎదురు చూస్తున్నారట. పవన్ సానుకులంగా స్పందిస్తే జనసేనలోకి బాలినేని సిద్దంగా ఉన్నట్లు తెలుస్తుంది.గతంలో పవన్ కల్యాణ్ చేనేత వస్త్రాలు ధరించాలని బాలినేనికి ట్విట్టర్ ఛాలెంజ్ చేసినప్పుడు.. బాలినేని చేనత వస్త్రాలు ధరించి ఛాలెంజ్ తీసుకున్నారు. అప్పుడు వైసీపీలో బాలినేని వ్యవహారంపై పెద్ద రచ్చ నడిచింది. వైసీపీలో తనకు జగన్ వల్ల చాలా అవమానాలు ఎదరయ్యాయని బాలినేని తనవారి దగ్గర ఆవేదన వ్యక్తం చేస్తున్నారంట. జగన్ ఓన్లీ ఐప్యాక్ టీం మీద ఆధారపడి.. సీనియర్ల సలహాలు తీసుకోలేదని.. సజ్జల వంటి ఒకరిద్దరు నేతలు, అధికారులను నమ్ముకుని పార్టీని నాశనం చేశారని అంటున్నారంట.ఇలాంటి పరిస్థితుల్లో జగన్‌కు దగ్గర బంధువైన బాలినేని పార్టీ మారితే ప్రకాశం జిల్లాలో వైసీపీకి కోలుకోలేని స్ట్రోక్ తగిలినట్లే. బాలినేని వైసీపీని వీడతారన్న వార్తలను ఇంతవరకూ బాలినేని గానీ.. ఆయన కుటుంబ సభ్యులు కానీ ఖండించడం లేదు. కనీసం సోషల్ మీడియా వేదికగా కూడా రియాక్ట్ కాకపోవడంతో ఆ ప్రచారానికి మరింత బలం చేకూరుతోంది. మరి బాలినేనికి ముహూర్తబలం ఎప్పటికి కుదురుతుందో చూడాలి.

# గంజాయి మత్తులో యువకుల వీరంగం

శ్రీకాకుళంజూన్ 11 (ఆంధ్రరేఖ. ప్రతినిధి),శ్రీకాకుళం జిల్లా రేగిడి మండలం బూరాడ గ్రామ సెంటర్లో గంజాయి మత్తులో ముగ్గురు యువకులు వీరంగం సృష్టించారు. ఒంటరిగా వున్న మహిళా ఇంట్లోకి ప్రవేశించారు. మహిళా కేకలు వేయడంతో అక్కడనుంచి తప్పించు కొనే ప్రయత్నం చేసారు. వారిని పట్టుకున్న గ్రామస్థులపై పట్టుకున్న యువకులును మీరు ఎవరు అని ప్రశ్నించిన గ్రామస్తులపై ఆ ముగ్గురు యువకులు రాళ్ల రువ్వడంతో పలువురికి తీవ్రగాయాలు అయ్యా యిజ ఇద్దరు యువకులు తప్పిం చుకొని పారిపో?యారు. ఒకడిని గ్రామస్థులు పట్టుకున్నారు. పట్టుకున్న యువకుడి వద్ద గంజాయి ప్యాకెట్లను గుర్తించారు. ఆ యువకుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

# కొంపముంచిన షాడో సీఎం

విజయవాడ,జూన్ 11 ఆంధ్రప్రదేశ్ లో మొన్న జరిగిన ఎన్నికలు వైసీపీ కొంప ముంచాయి. జగన్ మ్యానియా పని చేస్తుందని, సంక్షేమ పథకాలు గట్టెక్కిస్తాయని.. సామాజిక న్యాయం తమకు న్యాయం చేస్తుందని భావించిన వైసీపీ చివరికి చతికిల పడింది. 2019లో 151 సీట్లు ఇచ్చిన ప్రజలు.. 2024 ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేసి దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయ్యే తీర్పు నిచ్చారు. ఈ తారుణంలోనే ఓటమికి గల కారణాలను ఎవరికి నచ్చినట్లు వాళ్లు ఆలోచిస్తున్నారు. కానీ అన్నంటికంటే అసలు కారణం జగన్ చుట్టు వుండే కోటరీ అనేది జగమెరిగిన సత్యం.జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు చేసిన ప్రతి పనిలో జగన్ కి 10 శాతం ప్రమేయం ఉంటే చుట్టూ ఉండే కోటరీది 90 శాతం పాత్ర ఉంటుంది. అటు ప్రజలతో పాటు ఇటు పార్టీ నేతల్లో కూడా జగన్ పై వ్యతిరేకత రావడానికి ప్రధాన కారణం కోటరీలో ఉండే ఆ ఇద్దరే అని నేతలంతా గళం విప్పుతున్నారు. వారి వల్లే ఈ స్థాయిలో పార్టీ దెబ్బతిందని వైసీపీ నాయకులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కనిపించే సీఎం జగన్ ఒకరైతే.. కనపడని షాడో సీఎం మరొకరు ఉన్నారు. సీఎం తర్వాత తానే సీఎం అనేంత రేంజిలో బిజీబిజీగా గడుపుతూ.. ప్రతి ప్రభుత్వం మీటింగ్ లోనూ.. ప్రైవేట్ మీటింగ్ లోనూ తానే కనపడేవారు. ఈ తరహా వైఖరిపై విమర్శలు వస్తున్నప్పటికీ.. మళ్లీ అదే రిపీట్ చేస్తూ.. చివరికి పార్టీ పతనానికి కూడా ఒక కారణం అయ్యారు. అతనే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి.ప్రభుత్వంలో ఏ నిర్ణయం తీసుకున్నా.. ఎవరికి మంత్రి పదవులు రావాలన్నా.. ఎవరికైనా పోస్ట్ కేటాయించాలన్నా.. చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి అధికారుల వరకు.. బదిలీ చేయాలన్నా సజ్జల అనుమతి లేనిదే.. సీఎం జగన్ చేయడమే టాక్ పెద్ద ఎత్తున నడిచింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిన్నా మొన్నటి వరకు కూడా ఇదే నడిచిందని భాహాటం గానే సొంత నేతలు సైతం విమర్శలు గుప్పించారు. సజ్జల రామకృష్ణారెడ్డి వల్లే పార్టీ ఇంతలా దిగజారి పోయిందని.. 11 సీట్లకే పరిమితం అయ్యిందని ఫైర్ అవుతున్నారు.ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అంగన్వాడీలు, ఆశ వర్కర్స్.. ఇలా ఎవరితో చర్చలు జరిగిన.. ప్రతి సందర్భంలోనూ సజ్జల వీరు ఎవరు తమ ఓటు బ్యాంకు కాదని కించ పరిచే విధంగా మాట్లాడేవారు. ఈ మాటలే ఎన్నికల్లో రిఫ్లెక్ట్ అయ్యాయని చాలా మంది భావిస్తున్నారు. ఆయన మాట్లాడిన తీరు వల్లే వారి ఓటు బ్యాంక్ అంతా చేజారిందని వాపోతున్నారు. పార్టీ ఓటమికి పూర్తి బాధ్యత అంతా సజ్జల పైనే ఉంటుందని సొంత నేతలే నిప్పులు చెరుగుతున్నారు.సజ్జల తర్వాత ఆ స్థాయిలో పార్టీ ఓటమికి కారణమైన వ్యక్తి ఎవరా అంటే.. సీఎంఓలో ఉండే దనుంజయ రెడ్డి వైపే అందరి వేళు చూపిస్తున్నాయి. ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తూ.. అన్ని నిర్ణయాలు తానే తీసుకుంటూ.. అరాచకాలు చేసుకుంటూ ముందుకు వెళ్తుంటే దానికి ధ్రువీకరణ పత్రం ఇచ్చింది ధనుజయ రెడ్డి అని చెబుతున్నారు. నిర్ణయాలు సజ్జలు తీసుకుంటే ఆర్డర్లు ధనుంజయ రెడ్డి ఇచ్చేవారని? అధికారులు మొత్తాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్నారని మండిపడుతున్నారు. జగన్ ఓటమికి కారణమైన ప్రతి తప్పులో ధనుంజయ రెడ్డి హస్తం కూడా ఉందని బహిరంగం గానే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ వ్యవహారంపైనే వైసీపీ మాజీ ఎమ్మెల్యే మీడియా సాక్షిగా కుండబద్దలు కొట్టేలా మాట్లాడడం ఈ ఆరోపణలను నిజం చేస్తున్నాయి. వైసీపీ ఓటమి తర్వాతహ ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడిన రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా.. ధనుంజయ రెడ్డిపై తీవ్రమైన విమర్శలు చేశారు. సీఎం జగన్ ని కలిసే అవకాశం కూడా తమకి ఇవ్వలేదని.. తానే సీఎం లాగా బిహేవ్ చేసే వారని ఆందోళన వ్యక్తం చేశారు.మొత్తానికి సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయ్ రెడ్డి కలిసి పార్టీ నాశనానికి కృషి చేశారే తప్ప.. ఎదుగుదలకు ఎక్కడ ఉపయోగపడలేదని తీవ్ర ఆరోపణలైతే వినపడుతున్నాయి

# ఆపరేషన్ లోటస్ షూరూ అయినట్టేనా

విజయవాడ,జూన్ 11 ఆపరేషన్ లోటస్ ఈ మాట బీజేపీ రాజకీయాల్లో కీలకం. ఇతర పార్టీల నేతల్ని చేర్చుకునేందుకు ఈ ఆపరేషన్ నిర్వహిస్తారని ఎక్కువ మంది నమ్ముతూ ఉంటారు. అయితే బీజేపీ మాత్రం ఇలాంటి ఆపరేషన్లు ఏమీ చేయలేదని.. భవిష్యత్ లో ఎప్పుడూ చేయబోమని అంటున్నారు. కానీ విపక్ష నేతలు మాత్రం.. బీజేపీ ఆపరేషన్ లోటస్ లు ప్రారంభించిందని ప్రకటిస్తున్నారు. తాజాగా తమిళనాడు కాంగ్రెస్ సీనియర్ నేత, చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం వైసీపీపై తర్వాత ఆపరేషన్ లోటస్ జరగబోతోందని సోషల్ మీడియాలో ప్రకటించారు. కార్తీ చిదంబరంకు ఏదో సమాచారం లేకపోతే ? ఏపీ రాజకీయాలు.. అదీ వైసీపీ గురించి ట్వీట్ పెట్టాల్సిన అవసరం లేదు. అయితే అదేమిటి అనేది మాత్రం సస్పెన్స్ గా మారింది. వైఎస్ఆర్‌సీపీకి నలుగురు లోక్ సభ సభ్యులు ఉన్నారు. పదకొండు మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. సమీప భవిష్యత్ లో ఆ పార్టీకి ఒక ఎమ్మెల్సీ లేదా ఓ రాజ్యసభ ఎంపీ సీటు వచ్చే అవకాశాలు లేవు. బీజేపీకి రాజ్యసభ సభ్యుల అవసరం ఉంది. టీడీపీ రాజ్యసభ సభ్యుల్ని గతంలో విలీనం చేసుకున్నట్లుగా ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుల్ని విలీనం చేసుకునే ప్రక్రియ ఏమైనా ప్రారంభించారా అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. బీజేపీకి రాజ్యసభలో పూర్తి స్థాయిలో మెజార్టీ లేదు. ఇంత కాలం వైఎస్ఆర్‌సీపీతో పాటు బీజేడీ ఏకపక్షంగా మద్దతు ఇస్తూ వచ్చాయి. అయితే ఇప్పు?డు కూడా వైసీపీ మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉంటుంది. వ్యతిరేకిస్తామని చెప్పే అవకాశం ఉందు. వైసీపీలో వ్యాపార ప్రముఖులు ఎక్కవగా ఉన్నారు. గుజరాత్ కు చెందిన పరిమళ్ నత్వానీ కూడా వైసీపీ ఎంపీనే. ఆయన బీజేపీలో చేరడానికి పెద్దగా ఆపరేషన్ చేపట్టాల్సిన అవసరం లేదు. తెలంగాణకు చెందిన కృష్ణయ్య, నిరంజన్ రెడ్డిలు కూడా వైసీపీ ఎంపీలే. అలాగే ఏపీ నుంచి ఎంపీలుగా బీద మస్తాన్ రావు, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి , విజయసాయిరెడ్డి వంటి వారికి అనే అబ్లిగేషన్లు ఉన్నాయి.

వీరిలో ఎవరినైనా బీజేపీ ఆహ్వానిస్తే .. తిరస్కరించే అవకాశం ఉండదన్న వాదన ఉంది.గెలిచిన నలుగురు లోక్‌సభ ఎంపీలపైనా బీజేపీ కన్నేసే అవకాశం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. వైసీపీ తరపున గెలిచిన వారిలో అవినాష్ రెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి, తనూరాజా రాణి విజయం సాధించారు. వీరిలో ఒకరిద్దరు బీజేపీతో చర్చలు జరుపుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఎన్నికలు జరిగి రోజులు కూడా గడవనందున.. ఒకటి, రెండు నెలల తర్వాత కీలక పరిణామాలు చోటు చేసుకోవచ్చన్న వాదన వినిపిస్తోంది.

# గల్లా జయదేవ్ రీ ఎంట్రీ...



గుంటూరు, జూన్ 11 తెలుగు రాజకీయాల్లో చెరగని ముద్ర గల్లా ఫ్యామిలీది. పాటూరు రాజగోపాల్ నాయుడు నుంచి గల్లా జయదేవ్ వరకు ఆ కుటుంబం రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగింది. మాజీ ఎంపీ రాజగోపాల్ నాయుడు నుంచి రాజకీయ వారసత్వాన్ని అందుకున్న ఆయన కూతురు గల్లా అరుణ కుమారి ఆ తరువాత ఆమె కొడుకు జయదేవ్ తెలుగు రాజకీయాల్లో తమదైన మార్క్ చూపించారు. గల్లా జయదేవ్ గుంటూరు ఎంపీగా 2 సార్లు గెలిచి నేషనల్ లెవల్లో ఫోకస్ అయ్యారు.. అలాంటి ఫ్యామిలీ ఈ సారి ఎన్నికల్లో పోటీకి దూరమైంది. వైసీపీ సర్కారు వేధింపుల పుణ్యమా అని.. తమని నమ్ముకుని ఉన్న వేల కుటుంబాల శ్రేయస్సు కోసం పొలిటికల్ బ్రేక్ తీసుకుంది.అయిదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపు రాజకీయాలకు పరాకాష్ట గల్లా ఫ్యామిలీ రాజకీయ భవితవ్వం. దాదాపు 70 ఏళ్లుగా ప్రతి ఎన్నికల్లోనూ పోటీపడే ఆ కుటుంబం తొలిసారిగా పోటీ నుంచి తప్పుకుంది. వేల కోట్ల ఆస్తులు.. వేల మంది ఉద్యోగులు.. లక్షల మంది అభిమానులు అండదండలు ఉన్నా.. వ్యాపారం కోసం తమపై ఆధారపడిన ఉద్యోగుల కుటుంబాల కోసం గల్లా కుటుంబం రాజకీయాలను తప్పుకోవడంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఎన్నికల ఫలితాల తర్వాత కూడా జరుగుతూనే ఉంది.రాజకీయాలకు ఇక సెలవు అంటూ గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ చేసిన ప్రకటన.. టీడీపీ కార్యకర్తలను గల్లా అభిమానులను నివ్వెరపరిచింది. 1955 నుంచి రాజకీయాల్లో ఉన్న జయదేవ్ కుటుంబం తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల సమరం నుంచి తప్పుకోవడం పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ డిబేట్‌గా మారింది. 2019 ఎన్నికల నుంచే జయదేవ్ తల్లి మాజీమంత్రి గల్లా అరుణకుమారి ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. ఇప్పుడు జయదేవ్ కూడా తప్పుకోవడంతో 70 ఏళ్లలో తొలిసారిగా గల్లా కుటుంబం ఎన్నికల రణక్షేత్రం నుంచి నిష్క్రమించినట్లైంది.జయదేవ్ తాత గల్లా అరుణ తండ్రి పాటూరి రాజగోపాల్‌నాయుడు రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్రవేశారు. 1955లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన పాటూరు రాజగోపాల్‌నాయుడు ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాలను శాసించారు. చిత్తూరు జిల్లాలోని తవణంపల్లె నియోజకవర్గం నుంచి 1955లో కృషికార్ లోక్ పార్టీ అభ్యర్థిగా, 1962లో స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికయ్యారు. పాటూరు రాజగోపాల్ నాయుడు. 1972లో శాసన మండలి సభ్యుడుగా పనిచేశారు. తర్వాత చిత్తూరు ఎంపీగా రెండు సార్లు విజయం సాధించారు.జిల్లాలో అనేక సామాజిక కార్యక్రమాలతో జనం లో నిలిచిన రాజగోపాల్ నాయుడుని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కూడా తన రాజకీయ గురువుగా చెప్పుకుంటారు.ఆయన తర్వాత రాజగోపాల్‌నాయుడు కుమార్తె గల్లా అరుణ కుమారి కూడా అదే ఒరవడి కొనసాగించారు. ఆ కుటుంబ రాజకీయ చరిత్రలో ఎక్కువ విజయాలే కనిపిస్తాయి. రాజగోపాలనాయుడు వారసురాలిగా వచ్చిన గల్లా అరుణకుమారి 80వ దశకం నుంచి దాదాపు నలభయ్యేళ్లు రాజకీయాల్లో కొనసాగారు. 2014 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆమె మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లో ఎక్కడా కనిపించలేదు.ఆమె కుమారుడు గల్లా జయదేవ్ 2014లో రాజకీయాల్లో అడుగుపెట్టి వరుసగా రెండుసార్లు గుంటూరు ఎంపీగా గెలిచి ప్రత్యేకత చాటుకున్నారు. అరుణకుమారి కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పనిచేసి జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్రవేశారు. అమరరాజా ఫ్యాక్టరీస్‌తో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించిన గల్లా కుటుంబంపై ఈ ప్రాంతంలో ఎంతో గౌరవం ఉంది. అందుకే ఆ కుటుంబ రాజకీయ చరిత్రలో ఎక్కువ విజయాలే కనిపిస్తాయి.రెండుసార్లు ఎంపిగా గెలిచిన జయదేవ్.. చాలాకాలంగా రాష్ట్ర రాజకీయాల్లో పెద్దగా కనిపించడం లేదు.

# సీనియర్లకు హామీలతో సరా

కాకినాడ, జూన్ 11 ( కేంద్ర మంత్రివర్గంలో ఆంధ్రప్రదేశ్ నుంచి టీడీపీ ఎంపీలు కాకుండా బీజేపీ తరపున ఎన్నికైన భూతపతిరాజు శ్రీనివాస వర్మకు చోటు దక్కడం సంచలనంగా మారింది. ఏపీ నుంచి బీజేపీ తరపున ముగ్గురు ఎంపీలు గెలిచారు. ఖచ్చితంగా కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభిస్తుంది. ప్రాధాన్యతల క్రమంలో చూసుకుంటే మొదటి పేరు పురందేశ్వరి? తర్వాత సీఎం రమేష్.. ఆ తర్వాత శ్రీనివాసవర్మ ఉంటారు. కానీ బీజేపీ హైకమాండ్ మాత్రం శ్రీనివాసవర్మకే కేంద్ర మంత్రి పదవి ప్రకటించింది. ఆయన సహాయ మంత్రిగా పదవీ ప్రమాణం చేశారు. ఆయనకు కేంద్ర పెద్దలు ప్రాధాన్యమివ్వడం వెనుక కీలక సందేశం ఉందని అంచనా వేస్తున్నారు.బీజేపీలో కింది స్థాయి నుంచి పని చేసే వారికి ప్రాధాన్యం ఉంటుందని వారిని ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటామన్న సందేశాన్ని శ్రీనివాసవర్మకు కేంద్ర మంత్రి పదవి కేటాయించడం ద్వారా హైకమాండ్ పంపిందని అంటున్నారు. ఏపీలో పొత్తుల్లో టిక్కెట్ల కేటాయింపు తర్వాతా అన్నీ ఒక్క గ్రూపుకే ప్రాధాన్యం లభించిందన్న ఆరోపణలు వచ్చాయి. మొదటి నుంచి పార్టీలోనే ఉన్న సీనియర్లను పక్కన పెట్టారని .. వారికి ఒక్క చోట కూడా పోటీ చేసే అవకాశం ఇవ్వలేదన్న విమర్శలు వచ్చాయి. సీనియర్ నేతలు కొంత మంది ఈ అంశంపై హైకమాండ్‌కు కూడా లేఖ రాశారు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ కోసం పని చేసే వారిలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుందన్న ఆందోళన కూడా కనిపించింది. అయితే పొత్తులు, ఇతర కారణాల వల్ల బీజేపీ హైకమాండ్ టిక్కెట్ల కేటాయింపులో న్యాయం చేయలేకపోయింది. అప్పటికీ నర్సాపురం సీటు కోసం రఘురామకృష్ణరాజు కోసం ఇతర పార్టీలు తీవ్రంగా ఒత్తిడి చేసిన వెనక్కి తగ్గలేదు. మొదటి నుంచి పార్టీలోనే ఉన్న భూపతిరాజు శ్రీనివాసవర్మకే కేటాయించారు. మార్పు చేయాలని వచ్చిన ఒత్తిళ్లను అంగీకరించలేదు. ఆయననూ మారిస్తే ఇక పేరుకే బీజేపీ పోటీ అని.. కిందిస్థాయి నుంచి బీజేపీలో పని చేస్తూ వచ్చిన వారు ఎవరికీ చాన్స్ రాలేదన్న అభిప్రాయం పెరుగుతుందని వెనక్కు తగ్గారు. ఇప్పుడు కేంద్ర మంత్రి పదవి కూడా ఆయనకే ఇవ్వడంతో పార్టీలో వలస నేతలకు మాత్రమే ప్రాధాన్యనం అనే ముద్రను చెరిపేయడానికి.. కిందిస్థాయి నుంచి పని చేసే కార్యకర్తలకు భరోసా ఇవ్వడానికి శ్రీనివాసవర్మకు చాన్సిచ్చారని చెబుతున్నారు. ఆయనకు పదవి ఖరారు కాగానే సోము వీర్రాజుతో సంతోషం పంచుకునున్నారు. ఎన్నికల్లో పోటీ కోసం గట్టిగా ప్రయత్నించిన విష్ణువర్ధన్ రెడ్డి కూడా కొత్త కేంద్రమంత్రిని అభినందించారు.

# మళ్లీ ఏపీకి అన్యాయమేనా...

విజయవాడ, జూన్ 11 ,ఆంధ్రప్రదేశ్, తెలుగుదేశం పార్టీ , చంద్రబాబునాయుడు పేర్లు గత వారం రోజులుగా దేశ రాజకీయాల్లో మార్మోగిపోతున్నాయి. మోదీ 3.0 ఏర్పడటానికి ఆంధ్రప్రదేశే కారణమని అందరూ విశ్లేషిస్తున్నారు. అది నిజం కూడా. ఏపీలో ఎన్డీఏ కూటమికి 21 లోక్ సీట్లు వచ్చాయి. మొత్తంగా ఎన్డీఏ కూటమికి వచ్చిన సీట్లు 293 మాత్రమే. వీటి నుంచి ఏపీ నుంచి వచ్చిన సీట్లను మైనస్ చేస్తే ఎన్డీఏ కూటమి మెజార్టీకి తగ్గిపోతుంది. గతంలో ఎన్డీఏకు ఒక్క సీటు కూడా లేదు. ఇప్పుడు 21 వచ్చాయి. ఈ కారణంగానే దేశవ్యాప్తంగా ఏపీ పేరు మార్మోగింది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్ణయంపైనా ఆసక్తి ఏర్పడింది. అయితే చంద్రబాబు మాత్రం తామ ఎన్డీఏతో కలిసి పోటీ చేశాం. కలసే పయనిస్తామని స్పష్టం చేశారు.కౌంటింగ్ జరిగిన రోజు నుంచి జాతీయ మీడియాలో కింగ్ మేకర్ అంటూ టీడీపీకి హైప్ వచ్చింది. పది మంత్రి పదవులు, స్పీకర్ పదవిని చంద్రబాబు డిమాండ్ చేస్తున్నారని ప్రచారం జరిగింది. అయితే చంద్రబాబు కానీ.. జాతీయ మీడియాతో మాట్లాడిన నారా లోకేష్ కానీ.. తాము కేంద్రంలో మంత్రి పదవుల కోసం చూడటం లేదని రాష్ట్రం ప్రయోజనాల కోసమే చూస్తున్నామని ప్రకటించారు. అయితే పైకి అలా అంటున్నారు కానీ వచ్చిన హైప్‌కు తగ్గట్లుగా పదవులు లభిస్తాయని అనుకున్నారు.

# ఘనంగా ఎలమందేశ్వరి 18 వ వార్షికోత్సవం....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూన్ 11 ఎలమందేశ్వరి జ్యోతి లింగేశ్వర స్వామి 18 వ వార్షికోత్సవ సందర్భంగా కర్నూల్ నంద్యాల జిల్లాల నుండి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారికి ముడుపులు సమర్పించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిధులుగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉపాసకులు నల్లబోతుల ఉదయ నరసింహారాజు స్వామి హాజరయ్యారు అదేవిధంగా జై గౌడ డోన్ తాలూకా వ్యవస్థాపక అధ్యక్షులు జలదుర్గం మద్దిలేటి గౌడ్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై అమ్మవారి అన్నదాన కార్యక్రమంలో సహకారం అందించారు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కుటుంబం నుండి అమ్మవారికి స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి 50 వేల రూపాయలు దేవాలయ గోపుర నిర్మాణమునకు ఇవ్వడం జరిగినది శ్రీ రామచంద్ర మాలిక్ బాబా సమస్తాన్ భజన మండలి మరియు శ్రీ వెంకట్ నాయక్ పల్లె భజన మండలి కమలాపురం భజన మండలి వారు దేవాలయ ప్రా వచ్చి ఉన్నారు రాత్రిఅక్కన్న భజన కార్యక్రమం చేపట్టిస్తున్నారని ఈ సందర్భంగా ఏఈ నాగరాజు ఆలయ సేవకులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గుమ్మకొండ గ్రామ నివాసి వేముల చంద్రశేఖర్ గౌడ్ నాగ శేషయ్య దంపతులు హాజరయ్యారు

# కర్నూలు జిల్లా ఓటర్లకు ధన్యవాదములు

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే బాబురావు



విభారే న్యూస్. జూన్ 11. కర్నూల్ ప్రతినిధి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఓట్లు వేసిన ఓటరు మహాశయులకు అందరికీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు గారు కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాబురావు గారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడుతున్న తెలుగుదేశం ప్రభుత్వానికి ముఖ్యమంత్రి కాబోతున్న చంద్రబాబు నాయుడు గారికి జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున అభినందనలు తెలుపుతున్నామని అదేవిధంగా తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన అన్ని పథకాలను అమలు చేయాలని రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టు కర్నూలు జిల్లాలో ఉన్న గుండ్రేవుల, వేదవతి, ఆర్ డి ఎస్, గురు రాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణను రద్దు చేయాలి, టిడ్కో ఇల్లను లబ్ధిదారులకు త్వరగా పంపిణీ చేయాలని, సంవత్సరానికి మూడు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేయాలని అదేవిధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం త్వరగా అమలు చేయాలని బాబురావు గారు కోరారు. మీరు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను, ముఖ్యమంత్రి అయిన వెంటనే మొదటి సంతకం డీఎస్సీ పై పెడతానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని అలాగే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని, బాబురావు గారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ అనంతరత్నం డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఈ లాజరస్ మొదలగువారు పాల్గొన్నారు.

# చెత్త చెదారం వల్లే మురికి కాలువలు నిండి పోతున్నాయి:

## మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 11- చెత్త చెదారం వేయడం వల్లే మురికి కాలువలు నిండి పోతున్నాయని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన పట్టణంలో పలు ప్రాంతాలలో శానిటేషన్ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు . డ్రైనేజీలో నీరు నిల్వ ఉన్న చోట క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ వ్యర్థాలు చెత్త చెదారం కాల్వల్లో వేయడం వల్లే వర్షాలు వచ్చినప్పుడు మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని తెలిపారు . ప్రజలు చెత్త చెదారం కాల్వల్లో వేయడం మానుకోవాలని సూచించారు. వేసిన వారికి మున్సిపాలిటీ రూల్ ప్రకారం నోటీసులు జారీ చేయాలని సిబ్బంది కి సూచించారు. కమిషనర్ వెంట . అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మీనారాయణ. శివ ప్రసాద్ రెడ్డి . సచివాలయ సిబ్బంది. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రత్యక్ష ప్రసారం ద్వారా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ డా జి.సృజన



విభారే న్యూస్ కర్నూలు ) జూన్ 11, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా జి.సృజన పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గన్నవరం వద్ద కేసరిపల్లిలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు వీక్షించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ఉదయం 10.00 గంటల నుంచి ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ప్రారంభమవుతుంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుగారు ఉదయం 11.27 నిమిషాలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. దీన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు జిల్లా కేంద్రంలో, అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు.. కర్నూలు జిల్లా కేంద్రంలోని సునయన ఆడిటోరియంలో, పత్తికొండ ఎంపీడీవో కార్యాలయంలో, కోడ ఎంపీడీవో కార్యాలయంలో, ఆదోని మున్సిపల్ కార్యాలయంలో, ఆలూరు ఎంపీడీవో కార్యాలయంలో, మంత్రాలయం ఎంపీడీవో కార్యాలయంలో, ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలు, అధికారులు ఈ కార్యక్రమాన్ని వీక్షించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రత్యక్ష ప్రసారానికి అన్ని ఏర్పాట్లు

## మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 11-రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా పట్టణంలోని టౌన్ హాల్. మరియు ఎన్టీఆర్ షాదిఖాన యందు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గన్నవరం వద్ద కేసరిపల్లిలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు వీక్షించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు . బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు . ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుగారు ఉదయం 11.27 నిమిషాలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. మున్సిపల్ సిబ్బంది. సచివాలయ సిబ్బంది. మెప్మా సిబ్బంది . ప్రజలు, అధికారులు ఈ కార్యక్రమాన్ని వీక్షించాలని కమిషనర్ నిరంజన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా మలేరియా వ్యతిరేక మహోత్సవం :డాక్టర్ సైలీస్ కుమార్







విభారే న్యూస్....జూన్11,కర్నూలు జిల్లా కల్లూరు మండలం కల్లూరు పి హెచ్ సి ఆసుపత్రిలో మలేరియా వ్యతిరేక మహోత్సవం కార్యక్రమాన్ని డాక్టర్ స్టైలిష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ సందర్భంగా డాక్టర్ సైలేష్ కుమార్ మాట్లాడుతూ మలేరియా వ్యతిరేక మహోత్సవం ఈనెల 1 నుండి 30 తేదీ వరకు కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు, సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వర్షాలు పడి నీళ్ళు నిలవడం వలన దోమలు చేరి దోమల వల్ల మలేరియా వ్యాపిస్తుందని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తెలియజేశారు. త్రాగునీరు ఎక్కువ నిల్వ ఉంచకూడదని నిలువ నిలువ ఉంచడం వలన బ్యాటరీగా చేరి మలేరియా వ్యాపిస్తుందని ఆయన తెలియజేశారు.ప్రపంచవ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధనకై మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేద్దామని డాక్టర్ అన్నారు, కల్లూరు మండల పరిధిలోని పి హెచ్ సి ఆసుపత్రులు ఉన్న పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు, ఈ కార్యక్రమంలో కల్లూరుపి హెచ్ సి ఆస్పత్రిసూపర్వైజర్లు ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు ల్యాబ్ టెక్నీషియన్లు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ రూముల బకాయిలు వెంటనే చెల్లించాలి

## లేనిచో కఠినమైన చర్యలు ఆర్ ఓ వెంకట కృష్ణ



విభారెన్యూస్నంద్యాలమాప్రతినిధిజూన్11-మున్సిపల్ రూముల బకాయిలు వెంటనే చెల్లించాలని మున్సిపల్ ఆర్ ఓ వెంకట కృష్ణ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మార్కెట్. ఎన్టీఆర్ కాంప్లెక్స్. ప్రతాప్ టాకీస్ వద్ద ఉన్న మునిసిపల్ రూమ్ ల బకాయిల వసూలు కోసం సిబ్బంది తో కలిసి వెళ్లారు . ఆర్ ఓ వెంకటకృష్ణ మాట్లాడుతూ ఈ రోజు బకాయిల ద్వారా 8 లక్షలు వసూలు అయ్యిందని తెలిపారు. కొందరు సమయం ఇస్తే బకాయిలు కడుతాం అంటున్నారని ఆయన అన్నారు. బకాయిలు వెంటనే చెల్లించాలని లేని యెడల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




# ఎన్నికల పక్రియ విజయవంతం


## సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు
## జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 11-జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ కార్యక్రమాన్ని అత్యంత నైపుణ్య పద్ధతిలో శాంతియుతంగా, విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు అభినందనలు తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో సార్వత్రిక ఎన్నికలు - 2024 విజయవంత ప్రక్రియపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి జిల్లాధికారులు, రిటర్నింగ్ అధికారులు, సంబంధిత సిబ్బందితో సక్సెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని తప్పొప్పులు మొదులుకొని కౌంటింగ్ ముగిసేంతవరకు సంబంధిత అధికారులందరి సమిష్టి కృషితోనే ఎన్నికల ప్రక్రియ విజయవంతమైందన్నారు. అదే రీతిలో రిటర్నింగ్ అధికారులు, అన్ని టీంల నోడల్ అధికారులు, లైజన్ అధికారులు, మండల తాసిల్దార్లు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సాంకేతిక సిబ్బంది, ఇతర శాఖల ఉద్యోగులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ ఎన్నికల విధుల్లో పాల్గొని తమ వంతు పాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు, జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ కృతజ్ఞతాభివందలను తెలిపారు.జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ మొదటిసారి అయినప్పటికీ అందరి సహకారం, సమిష్టి కృషితో విజయవంతంగా నిర్వహించుకున్నామన్నారు. . సూక్ష్మ లోపాలు మినహా అధికారులందరూ సరైన టైంలో బాధ్యత తీసుకొని సమిష్టి కృషితో సమర్థవంతంగా ఎన్నికల విధులను నిర్వహించారని కొనియాడారు.అంతకుముందు జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మజ, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు, బనగానపల్లి, నందికొట్కూరు రిటర్నింగ్ అధికారులు మల్లికార్జున్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, సుధారాణి, కామేశ్వరరావు, ఎం దాసు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, భూగర్భ గనుల శాఖ ఏడి రామచంద్ర డిపిఓ మంజులవాణి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ జెహారున్నిసా బేగం తదితర జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో ఎదుర్కొన్న అనుభవాలను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు గారికి జిల్లా అధికారుల బృందం శాలువా కప్పి ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహుకరించారు.

# రాజకీయ ఒత్తిళ్లతోనే 860మంది వాలంటీర్ల రాజీనామా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 11: వైకాపా ఎమ్మెల్యేలు చెప్పా రనో, ఆ పార్టీ నేతలు ఒత్తిడి తెచ్చారనో రాజీనామా చేసిన గ్రామ, వార్డు వాలంటీర్ల పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. ఉన్నదాంతో పాటు రాబోతున్న అదనపు ఆర్థిక ప్రయోజనాలూ కోల్పోతున్నామని వాపో తున్నారు. నంద్యాల పట్టణంలో 44 వార్డులో 1026 మంది వాలంటీర్లు ఉన్నారు . సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక పట్టణంలో 860 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. ఎన్నికల్లో తమ పార్టీ తరఫున ప్రచారం చేయాలన్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతల ఒత్తిళ్లతో వీరు వాలంటీరు ఉద్యోగాలను వదులుకున్నారు. వీరిలో చాలామంది ప్రచారంలో వైకాపా అభ్యర్థులకు అండగా నిలబడ్డారు. ఓటర్లకు తాయిలాల పంపి ణీలో కీలకంగా వ్యవహరించారని విమర్శలు ఉన్నాయి . తీరా, ఎన్నికల్లో వైకాపా బోర్లా పడటం, ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుండటంతో రాజీనామా చేసిన వాలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. తమ భవిష్యత్తేంటని ప్రశ్నిద్దామన్నా, వైకాపా నేతలు ముఖం చాటేస్తున్నారని వాపోతునా న్రు. ఒత్తిళ్లకు తలొగ్గక కొనసాగిన వారంతా మంచి రోజులు రాబోతు న్నాయని ఆశిస్తున్నారు. వాలంటీర్ల పారితోషికం రెట్టింపు చేస్తామన్న చంద్రబాబు హామీ వారిని ఊరిస్తోంది.




# వేరుశనగ విత్తనాల పంపిణీ...

విభారే న్యూ డోన్ మా ప్రతిని:-జూన్ 11 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన విత్తన పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్యాపిలి వ్యవసాయ కార్యాలయము నందు వేరుశెనగ విత్తన పంపిణీ కార్యక్రమం మంగళవారం చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్యాపిలి మాజీ ఎంపీపీ శ్రీనివాసులు నంద్యాల పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి రామ్మోహన్ యాదవ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి మధు కుమార్ డోన్ నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు నాగేంద్ర ప్యాపిలి సీనియర్ నాయకులు కొంగనపల్లె మధు మరియు కిట్టు ప్యాపిలి మండల తెలుగు యువత అధ్యక్షులు కోదండ రామయ్య మరియు వ్యవసాయ అధికారి కార్యాలయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**